క్లుప్తంగా

18న సచివాలయాల ముట్టడి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : పట్టణ ప్రాంత పేద ప్రజలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు మూడు సెంట్లు ఇంటిస్థలం కేటాయింపునకు ఈనెల 18వ తేదీ సీపీఐ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల సీపీఐ కార్యదర్శి చింతలపూటి నాగమ్మ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలు శనివారం చిన్నఓరంపాడు పంచాయతీలో ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ఇంటిస్థలం లేని పేదలు పాల్గొని జయప్రదం చేయాలని నాగమ్మ కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజమ్మ, లక్ష్మీదేవి, జ్యోతి, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేటు హస్పిటల్‌లో వైద్యం చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆదినారాయణను ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని తిప్పరాజుపల్లిలోని ఆదినారాయణ స్వగృహానికి ఎమ్మెల్యే వెళ్లి ఆదినారాయణ ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

గిరిప్రదక్షిణ కోసం జనరేటర్ వితరణ

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన అత్తిరాల(హత్యరాల)లో పౌర్ణమి రోజు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం కోసం గుగ్గిళ్ల కుటుంబ సభ్యులు జనరేటర్, ఎల్‌ఈడీ బల్బులకు నగదు వితరణ చేశారు. శుక్రవారం రాత్రి గిరి ప్రదక్షిణ కమిటీ ప్రతినిధులకు దాతలు నగదు అందజేశారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల కుటుంబ సభ్యులు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న మీడియా ప్రతినిధులు, వైద్యుడు

రాయచోటి టౌన్ : రాయచోటి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. శనివారం జాతీయ మీడియా దినోత్సవంలో భాగంగా రాయచోటి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు ఆస్పత్రి డాక్టర్ లక్ష్మిప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రింట్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ సమాజంలో మీడియా అనేది ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచి ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించేందుకు ఎనలేని కృషి చేస్తోందన్నారు.


హౌసింగ్ లబ్ధిదారులకు డ్వాక్రా రుణాలు



లబ్ధిదారులకు డ్వాక్రా రుణాలను అందజేస్తున్న ఎంపీడీఓ

పెనగలూరు : మండలంలోని సాతుపల్లి గ్రామస్తులకు రూ. 2 లక్షల చెక్కును ఎంపీడీఓ విజయారావు శనివారం అందజేశారు. హౌసింగ్ మంజూరు కావడంతో నిర్మాణానికి వెలుగు ద్వారా రెండు డ్వాక్రా సంఘాలకు నలుగురికి ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున రూ. 2 లక్షలను అందజేసినట్లు వారు తెలిపారు. డ్వాక్రా రుణాలతో పెండింగ్‌లో ఉన్న పక్కా గృహాలను పూర్తి చేసుకునేందుకు ఈ నగదు ఉపయోగపడుతుందన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనం వడ్డిస్తున్న ఉప సర్పంచ్ ముస్తాక్

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పయ్యరాజుపేట ప్రాథమిక పాఠశాలలో ఉప సర్పంచ్ ముస్తాక్ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా విద్యార్థులకు భోజనం వడ్డించారు. తదుపరి ఉప సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు పునరుజ్జీవం

- శరవేగంగా ఆలయాల పున:నిర్మాణం
- ఆలయాల విశిష్టతను పెంచేలా గత ప్రభుత్వం పనులు
- మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం జీర్ణోద్ధరణతో పూర్వవైభవం
- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు, మండల ప్రజానీకం



సర్వాంగ సుందరంగా సాగుతున్న మల్లూరమ్మ ఆలయ పునరుద్ధరణ పనులు



శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణ పనులు

చిన్నమండెం : పురాతన ఆలయాలు పునర్‌నిర్మాణంతో ఆధ్యాత్మికతను సంతరించుకోనున్నాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలయాల జీర్ణోద్ధరణ కార్యక్రమం అమలు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ఆలయాలు పునర్‌నిర్మాణాలతో భక్తిపారవశ్యం నిండుగా కనపడుతోంది. గత వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన నిధులతో చిన్నమండెం మండల పరిధిలోని శ్రీ మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయం, మల్లూరమ్మ ఆలయాల పునర్‌నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం దేవాలయాల పునర్‌నిర్మాణాలకు అధిక సంఖ్యలో నిధులను వెచ్చించింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి చొరవతో రాయచోటి నియోజకవర్గంలోని పలు ఆలయాల రూపురేఖలు మారిపోయాయని చెప్పవచ్చు. ఇందులో భాగంగా నరసింహస్వామి ఆలయానికి రూ.1.25 కోట్లు, మల్లూరమ్మ ఆలయానికి రూ.98 లక్షల నిధులు వెంటనే విడుదల కావడం జరిగింది. ఇందులో భాగంగా పనులను గుత్తేదారు శరవేగంగా నిర్మాణాలను చేపడుతున్నారు. చాలా పురాతన ఆలయాలు కావడంతో భక్తులు ఈ ఆలయాల నిర్మాణాలు వేగంగా పూర్తి కావాలని కోరుకుంటున్నారు. మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అత్యంత శ్రద్ధ తీసుకొని పెద్ద మొత్తంలో ఈ ఆలయాలకు నిధులను కేటాయింప చేయించడంలో చొరవచూపారు. ఇందుకు తగ్గట్టు ఆలయాల పునర్‌నిర్మాణాలు ఎంతో నాణ్యతగా జరుగుతున్నవి. ఎంతో ఘన చరిత్ర కలిగిన మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్‌నిర్మాణం అత్యంత పటిష్ఠంగా సాగుతుండటంతో పలువురు భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పనులు వేగంగా జరుగుతున్నాయి

గత ప్రభుత్వంలో విడుదలైన నిధులతో శ్రీ మండెం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తున్నారు. గుత్తేదారు కూడా పనులు వేగవంతం చేస్తున్నారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా మరుగునపడిన ఆలయాలను గత ప్రభుత్వం ఆలయాలను అభివృద్ధి చేసేందుకు నిర్ణయించి నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయం.

– తులసమ్మ, ఎంపీటీసీ, దేవగుడిపల్లె, చిన్నమండెం

రూ.98లక్షలతో అభివృద్ధి పనులు

మల్లూరమ్మ ఆలయ నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.98 లక్షలు కేటాయించింది. ఆ నిధులతో మల్లూరమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. భక్తుల చిరకాల కోరిక పునఃనిర్మాణ పనులు జరుగుతుండటంతో గ్రామ ప్రజలు, భక్తులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలి. అలానే భక్తుల సౌకర్యాల కోసం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శ్యాంచందర్, ఎంపీటీసీ, మల్లూరు గ్రామం, చిన్నమండెం

జిల్లా కేంద్రంలోనే శిక్షణ ఇవ్వాలి



డీఈఓ సుబ్రమణ్యంకు వినతిపత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు

రాయచోటి అర్బన్ : జిల్లాలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పలు అంశాలపై ఇచ్చే శిక్షణను ఇకపై జిల్లా కేంద్రంలోనే నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు డీఈఓ సుబ్రమణ్యంకు విన్నవించారు. శనివారం సాయంత్రం వారు డీఈఓను కలుసుకుని మాట్లాడారు. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ఒక ప్రధానోపాధ్యాయుడు గుండెపోటుతో మరణించగా, మరొకరు ఐసీయూలో అడ్మిట్ అయ్యారన్నారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇక ముందు లీడర్‌షిప్ ట్రైనింగ్‌లను ఆయా జిల్లాల వారీగా నిర్వహిస్తామంటూ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఒకవేళ జిల్లాను దాటితే 100కిమీలు దూరం దాటకుండా చూస్తామని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తామంటూ చెప్పారన్నారు. రాయచోటి, మదనపల్లె డివిజన్‌లకు చెందిన హెచ్‌ఎంలకు అనంతపురం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన లీడర్‌షిప్ శిక్షణకు హాజరుకావాలంటూ ఆదేశాలందాయన్నారు. అన్నమయ్య జిల్లాలోని పాఠశాలలన్నీ అనంతపురం జిల్లా శిక్షణ కేంద్రానికి 100 కిమీల దూరంలో కాకుండా దూరంలో ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని డీఈఓ గమనించి జిల్లాలోని హెచ్‌ఎంలకు శిక్షణను అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, రామక్రిష్ణ, ఎం.నరసింహారెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, రామక్రిష్ణ, హరిబాబు, నరసింహులుతోపాటు పలుసంఘాలకు చెందిన ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నాగిరెడ్డి రిజర్వాయర్‌కు నిధులు కేటాయించండి

రాయచోటి టౌన్ : రాయచోటి నియోజకవర్గ తాగునీటి సమస్య పరిష్కరించండానికి రూ.156.60 కోట్ల నిధులు మంజూరునకు అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. శనివారం మండిపల్లి జలవనుల శాఖ మంత్రిని కలసి రాయచోటిలో నెలకొన్న తాగునీటి సమస్యపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ పరిధిలో మండిపల్లె నాగిరెడ్డి రిజర్వాయర్‌లోని హెచ్‌ఎన్‌ఎస్ మెయిన్ కెనాల్ బ్యాలెన్స్ పనులు పూర్తి చేసేందుకు రూ.156.60 కోట్లు మంజూరు చేయాలని కోరారు.



ఇరిగేషన్ మంత్రి నిమ్మలకు వినతి పత్రాన్ని అందజేస్తున్న మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి

పర్యవేక్షణ లోపం.. పనులు నాసిరకం

వీరబల్లి : మండలంలో గతనెల నుంచి విద్యుత్ లైన్ల పనులు సాగుతున్నాయి. అయితే ఈ లైన్లు పనులు ప్రభుత్వం ఓ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పారు. వారు కూలీలు ద్వారా విద్యుత్ స్తంభాలు నాటడం, వైర్‌లు లాగడం వంటి పనులు చేపడుతున్నారు. పనులు జరిగేటప్పుడు అధికారులు పరిశీలించడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనిలో నాణ్యత లేకుండా నాసిరకంగా స్తంభాలు పూడ్చడం, లైన్లు లాగారు. తద్వారా గాలి, వాన రావడంతో విద్యుత్ స్తంభాలు పడిపోవడం, వైర్లు తెగిపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలో రాగిమాను తొగటపల్లి నుంచి గ్రంధేవాండ్లపల్లికి వెళ్లే రోడ్డు మార్గం పక్కన విద్యుత్ లైన్ల పనులు జరుగుతున్నాయి. ఇటీవల గత మూడు రోజుల నుంచి మండలంలో కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడం, తీగలు తెగిపోవడం వంటివి జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నాణ్యత లేకుండా జరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ల ద్వారా చేపట్టిన పనులను పర్యవేక్షించి సక్రమంగా పనులు జరిగేటట్లు చూడాలని పలువురు కోరుతున్నారు. ఈ పనులపై మండల విద్యుత్ శాఖ అధికారి ఏఈని వివరణ కోరగా సక్రమంగా పనులు చేయాలని కాంట్రాక్టర్లకు సూచించినట్లు వారు తెలిపారు.



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఆహార సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

లక్కిరెడ్డిపల్లి : ఆహార సంరక్షణ, ఫుడ్ ప్రాసెసింగ్‌పై అవగాహన నైపుణ్యం కలిగి ఉండాలని కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లి వెంకటేశ్వర బేకరీలో విద్యార్థులకు సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో టై సెంటర్ ఫర్ లర్నింగ్ లిమిటెడ్ వారి సౌజన్యంతో ఫుడ్ ప్రాసెసింగ్‌పై వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు వీర పద్మజ విద్యార్థులకు అవగాహన కల్పించారు. బేకరీలో తయారు చేయు పదార్థాలు, కేక్‌లు వంటి పంటల తయారీపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో వారిలోని నైపుణ్యాలను వెలికితీయవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మహిళలకు చీరలు పంపిణీ

పెనగలూరు : మండలంలోని పొందలూరు దళితవాడలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి సోదరి ఆశాలత, మురళీరెడ్డి దంపతులు చీరలు పంపిణీ చేశారు. కార్తిక మాసం సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేయాలనే దృక్పథంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆశాలత

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

రాజంపేట రూరల్ : కేరళ రాష్ట్రంలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవస్థానంలో మండలపూజ ప్రారంభాను పురస్కరించుకొని పట్టణ శివారులోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో 13వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా 18 పడికట్లకు పడిపూజ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్త తుమ్మలపెంట పాలప్రకాష్, ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తిక మాసంను పురస్కరించుకుని శ్రీ అయ్యప్ప ఆలయంలో చేపట్టిన ప్రత్యేక పూజల్లో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఇదే క్రమంలో మండల పూజా మహోత్సవం సందర్భంగా రాత్రి స్వామి వారికి నిర్వహించిన పడిపూజ కార్యక్రమంలో రాజంపేట పరిసర మండలాల్లోని భక్తులు పెద్దఎత్తున పాల్గొని పరవశించారు. ఆలయ గురుస్వాములు కె.సత్యనారాయణస్వామి, కె.నాగరాజు, పురోహితుల బృందంతో కలిసి ప్రతి పడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన కార్యక్రమం వైభవోపేతంగా జరిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

గిరి ప్రదక్షిణలో భక్తులు

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణ పరిధిలోని సుద్దలవాండ్లపల్లె రోడ్డులో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. శనివారం స్వామి వారి ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించిన భక్తులు ప్రత్యేకమైన భక్తి శ్రద్ధలతో అయ్యప్పకు పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామి వారి గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భిక్ష ఏర్పాటు చేశారు. అలాగే స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఆలయ నిర్వాహకులు ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు.

సిద్దవటంలో పడిపూజ

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వామి మాల ధరించిన భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పలు పూజా కార్యక్రమాలను చేశారు. అనంతరం గురుస్వామి శ్రీరామదాసు మాట్లాడుతూ అయ్యప్ప స్వాములకు గ్రామోత్సవం సందర్భంగా ఈ పడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు చలపతి, బీమిశెట్టి శివరామయ్య, జొన్నాదుల మురళి, అయ్యప్ప స్వాములు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రాయచోటి టౌన్: గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు



సిద్దవటం: పడిపూజలో పాల్గొన్న అయ్యప్పస్వామి భక్తులు



రాజంపేట రూరల్: ప్రత్యేక అలంకరణలో హరిహర తనయుడు

పేదలకు సాయం చేసేవారే నిజమైన ధనవంతులు

ఒంటిమిట్ట : కష్టాల్లో ఉన్న పేదలను ఆదరించి సాయం చేసే హృదయం ఉండేవారే నిజమైన ధనవంతులని నూరుల్లా ఇస్లాం ట్రస్టు అధినేత అబ్దుల్ సుభాన్ అన్నారు. కడప జిల్లా, ఒంటిమిట్ట మండలం, మలకాటపల్లి సమీపంలో ఉన్న జామియా నూరుల్లా ఇస్లామిక్ ట్రస్టు ఆధ్వర్యంలో ఫౌండర్ అబ్దుల్ సుభాన్ పేదలకు ఆర్థిక సాయం అందించారు.

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలు, ఇమాములు, మౌజనులకు ప్రతినెల రూ. 500 నుంచి రూ. 2 వేలు వరకు ఆర్థికసాయం అందిస్తూ మానవత్వం చాటుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్వాస ఉన్నంతవరకు ట్రస్టు తరఫున పేదలకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో ఏక్తా యాంటీ కరప్షన్ కడప అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



నిరుపేదలకు సహాయం చేస్తున్న అబ్దుల్ సుభాన్

సౌమ్యనాథ అన్నదాన సేవా ట్రస్టుకు విరాళం



అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న దాతలు

నందలూరు : శ్రీ సౌమ్యనాథ సేవా ట్రస్టు అన్నదాన కార్యక్రమానికి రాజంపేటకు చెందిన యార్ల వెంకటాచలపతి జ్ఞాపకార్థం సతీమణి జ్యోతి రూ. 51,116లు విరాళాన్ని ట్రస్టు సభ్యులకు శనివారం అందజేశారు.

ఈ సందర్భంగా ట్రస్టు నాయకులు మాట్లాడుతూ దాతల సహకారంతో శని, ఆదివారాలు రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నిత్యాన్నదాన పథకం ఏర్పాటు కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సేవా ట్రస్టు చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, సుబ్బరామయ్య, చక్రాల సాయినాథ్, వంశీకృష్ణ, పెంచలయ్య, వరదయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు సామాజిక పురోగతికి సోపానాలు

- గ్రంథాలయ ఉద్యమకారులకు ఘన నివాళి
- వారి సేవలను కొనియాడిన వక్తలు

సంబేపల్లె : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని సంబేపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో గ్రంథాలయ వారోత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవన వికాసానికి సామాజిక పురోగతికి సోపాణాలు గ్రంథాలయాలు నిలిచాయన్నారు. యువకులు, విద్యావంతులు, విదార్థులు అందుబాటులో ఉన్న గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దేవప్రసాద్‌రెడ్డి, పీఎం బాషా, విజయభాస్కర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి అర్బన్ : గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు రాయచోటి గ్రంథాలయాధికారి జయభారత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులను జూనియర్‌లుగా, ఇంటర్, డిప్లమా, డీఎడ్ కోర్సులు అభ్యసించే వారిని సీనియర్‌లుగా విభజించి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. 18న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 19న చిత్రలేఖనం, ముగ్గుల పోటీలను జరుపుతున్నామన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడో రోజు శనివారం గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరు నాగభూషణం, ఎస్‌ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు టీచర్ రమణ పూలమాల వేసి నివాళులర్పించి వారి సేవలను కొనియాడారు. అనంతరం చిన్నమండెం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు శివశంకర్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు ఆంజనేయులురెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సిద్దవటం : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించామని గ్రంథాలయ అధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలతో నివాళి అర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హరికొండయ్య, రామలింగారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవరుచుకోవాలి

ఓబులవారిపల్లె : విద్యార్థి దశ నుంచే గ్రంథాలయాలకు వెళ్లి మంచి పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారులు గ్రంథాలయ ఏర్పాటుకు, అభివృద్ధికి అనేక త్యాగాలు చేసినటువంటి ఎస్‌ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకటరమణ, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు ఆష్రఫ్ అలీ, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమండెం: ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఓబులవారిపల్లె: నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



సిద్దవటం: వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



సంబేపల్లె: వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న టీచర్లు

గర్భిణులకు నగదు వితరణ



లక్ష్మీదేవికి నగదు అందజేస్తున్న ముక్కా వరలక్ష్మి

పెనగలూరు : మండలంలోని గర్భిణులకు శనివారం ముక్కా వరలక్ష్మి రూ. 85వేలు నగదును ఎంపీడీఓ కార్యాలయ భవనంలో అందజేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం గర్భిణులకు ఒక్కొక్కరికి రూ. 5 వేలు చొప్పున అందజేశారు. అలాగే గోవిందంపల్లికి చెందిన లక్ష్మీదేవి డెలివరీ అనంతరం పెరాలసిస్ రావడంతో ఆమెకు అదనంగా మరో రూ. 5 వేలు మొత్తం రూ. 10 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, నల్లపురెడ్డిపల్లి శ్రీనివాసులు రెడ్డి, గంగినాయుడు, బాలకృష్ణ, దామోదర్, సత్యనారాయణ, సీడీపీఓ నిర్మల, జ్యోతి, రాజేశ్వరి, రామ్మోహన్ నాయుడు, ఐసీడీఎస్ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.